క్లుప్తంగా

కుష్టు బాధితులు పాదరక్షలు వాడాలి


కూడేరు: పాదరక్షలు అందిస్తున్న ఏడీఎంహెచ్‌ఓ అనుపమ జేమ్స్

కూడేరు: కుష్టు బాధితులు పాదరక్షలు వాడాలని, లేదంటే కాళ్లకు పుండ్లు ఏర్పడి ఇబ్బంది పడాల్సి వస్తుందని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనుపమ జేమ్స్ అన్నారు. సోమవారం కూడేరు మండలంలోని లెప్రసీ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం కుష్టు బాధితులకు పాదరక్షలు అందజేశారు. పీఎంఓ నాగన్న, డీపీఎంఓలు సత్యనారాయణ, తిప్పేస్వామి, సూపర్ వైజర్ రవీంద్ర, హెల్త్ అసిస్టెంట్లు శివ ప్రసాద్, భాను, ఆశావర్కర్ పెద్దక్క పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించండి

కుందుర్పి: పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని కంబదూరు సీడీపీఓ వనజా అక్కమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని జంబుగుంపల, కెంచంపల్లి, కుందుర్పిలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సర్పంచులు గంగాధర, మారుతేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని నియమించండి

రాయదుర్గం: రాయదుర్గం పురపాలక సంఘంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప విన్నవించారు. సోమవారం రాయదుర్గం రోడ్లు, భవనాలశాఖ అతిథి గృహంలో కలిసి విన్నవించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పొరాళ్ల శివ, మున్సిపల్ కోఆప్షన్ సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జ్ నిజాం పాల్గొన్నారు. అనంతరం 18వ వార్డు కౌన్సిలర్ బనాపురం మంజునాథ కలెక్టర్‌ను కలిసి వార్డు సమస్యలపై విన్నవించారు.

వైభవంగా కల్యాణోత్సవం

కుందుర్పి: కుందుర్పిలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం హోమం, గ్రామోత్సవం, రాత్రికి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని గ్రామంలో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. మంగళవారం బ్రాహ్మణ సంఘాల సమారాధన, బుధవారం స్వామి బ్రహ్మరథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరీ తదితరులు తెలిపారు.

హరేసముద్రానికి ఆర్టీసీ బస్సు


బస్సు ముందు హరేసముద్రం గ్రామస్తులు

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రానికి ఆర్టీసీ సర్వీసును ప్రారంభించారు. 25 ఏళ్ల తర్వాత రాయదుర్గం డిపో నుంచి ఆర్టీసీ బస్సు నడుపుతున్నారు. ఏపీఐఐసీ చైర్మన్, నియోజకవర్గ సమయన్వయకర్త, మెట్టు గోవిందరెడ్డి దృష్టికి సర్పంచ్ తిప్పేస్వామి విషయాన్ని తీసుకెళ్లారు. సోమవారం ఆర్టీసీ బస్సు గ్రామంలోకి వచ్చింది. రాయదుర్గం నుంచి ఉదయం 8 గంటకు హరేసముద్రానికి వచ్చి, అక్కడ నుంచి బళ్లారి వెళ్లి సాయంత్రం 5 గంటలకు తిరిగి గ్రామానికి చేరుకుంటుంది. హరేసముద్రం గ్రామం జాతీయ రహదారికి 6 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గ్రామంలో దాదాపుగా రెండు వేలకు పైగా జనాభా ఉంది. ఏళ్లుగా గ్రామానికి బస్సు సర్వీస్ లేక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఈ నియోజకవర్గంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పనిచేసినా వారికి విన్నవించుకున్నా ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఆర్టీసీ బస్సు నడుస్తుండడంతో గ్రామ ప్రజల్లో ఆనందం నెలకొంది.

మహిళకు ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని వడ్డే కాలనీకి చెందిన అరుణ అనే మహిళకు రూ.20 వేల చెక్కును ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ సోమవారం అందించారు. ప్రబంద్, ఏరువాక ఆగ్రో సురేష్, హరి, సురేష్, అబ్దుల్‌వాహబ్, లోకేష్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

జంబుకేశ్వరుడికి అలంకరణ

రాయదుర్గంటౌన్: కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి ఆలయంలో స్వామికి సోమవారం ద్రాక్ష పండ్లతో అలంకరించారు. అర్చకులు రామకృష్ణస్వామి ఆధ్వర్యంలో జంబుకేశ్వరుడికి తెల్ల, నల్ల ద్రాక్షతో అలంకరించారు.

పోస్టర్ల విడుదల


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: ఈనెల 13,14,15 తేదీల్లో గుత్తి సమీపంలోని గొల్లలదొడ్డి వద్ద జరగనున్న సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాల పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. అనంతపురం ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తిప్పేస్వామి, జీవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్, కురుబ సంఘం తాలూకా అధ్యక్షుడు దొణస్వామి, సూరి, తిప్పేనాయక్, అంజి, రంగ, బాబునాయక్, శీనునాయక్, గోపాల్‌నాయక్, సింహాద్రి నాయక్ పాల్గొన్నారు.


(నాడు) గుంతలమయమైన గుండ్లపల్లి- బళ్లారి రోడ్డు


(నేడు) సుందరంగా పూర్తయిన రోడ్డు నిర్మాణం


(నాడు) బళ్లారి- రాయదుర్గం రోడ్డు


నేడు ఇలా

పల్లెలకు ప్రగతి బాటలు

గుండ్లపల్లి నుంచి బళ్లారికెళ్లే ప్రధాన రహదారిపై అడుగుకో గుంత..అవస్థల ప్రయాణం..వాహనదారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు.. కిలోమీటరు దూరం ప్రయాణం చేయాలన్నా నరకం అనిపించేది.. టీడీపీ హయాంలో కాలువ శ్రీనివాసులు మంత్రిగా పని చేసినా రోడ్డు మరమ్మతులపై దృష్టి సారించ లేదు. ఇదంతా గతం.. నేడు వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత రహదారులు ప్రగతి బాటలయ్యాయి. రూ.కోట్లు వెచ్చించి రహదారుల రూపురేఖలు మార్చారు. దీంతో ప్రయాణం సునాయాసమైంది. ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలు చేరుతున్నారు.

- నాడు నరక ప్రయాణం.. నేడు సునాయాసం
- రూపురేఖలు మారిన ఆర్‌అండ్‌బీ రహదారులు
- నాలుగున్నరేళ్లలో రూ.132.28 కోట్ల వ్యయం

రాయదుర్గం: జిల్లాలో ఎక్కాడా లేని విధంగా రాయదుర్గం నియోజకవర్గంలో 61 రోడ్డు పనులకు రూ.139.28 కోట్లు ఖర్చుచేసి రావాణా వ్యవస్థను మెరుగుపరిచారు. ప్రధానంగా గుండ్లపల్లి క్రాస్ నుంచి బళ్లారి కెళ్లే మార్గంలో రూ.3.40 కోట్లు ఖర్చుచేసి సుమారు 13 కిలో మీటర్ల మేర రహదారి నిర్మించారు. రాయదుర్గం నుంచి బళ్లారి దారిలో కుంటుమారెమ్మ ఆలయం నుంచి వినాయక సర్కిల్ వరకు రూ.1.55 కోట్లు ఖర్చు చేసి, సుమారు 6 కిలో మీటర్ల దారి నిర్మించారు. ప్రస్తుతం డబుల్‌రోడ్డు విస్తరించేలా ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. రాయదుర్గం- బళ్లారి రహదారి రూ.1.39 కోట్లతో 4.5 కిలో మీటర్లు, అదే దారిలో ఎర్రగుంట నుంచి ఉద్దేహాళ్ వరకు రూ.2.01 కోట్లతో 8.5 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం ఇటీవల పూర్తయ్యింది. బొమ్మనహాళ్ మండలం కళ్లుదేవనహళ్లి- పాల్తూరు మార్గంలో రూ.కోటి వ్యయంతో 5 కిలోమీటర్ల దారి నిర్మాణం పూర్తి చేశారు. కణేకల్లు మండలం మాల్యం- రూపనగుడి మార్గంలో రూ.1.10 కోట్లతో 7 కిలో మీటర్ల దారి నిర్మాణం చేపట్టారు. టీ వీరాపురం వద్దనున్న సాయిసుదీర్ కన్‌స్ట్రక్షన్ నుంచి కణేకల్లు వరకు రూ.12 కోట్లతో 13 కిలో మీటర్లు డబుల్ దారి నిర్మాణం చేపట్టారు. వీటితో నియోజకవర్గంలోని అనేక రోడ్లకు మహర్దశ కల్పించారు. వీటితో పాటు బళ్లారి- గుండ్లపల్లి మార్గంలో 3, రాయదుర్గం - కణేకల్లు మార్గంలో రూ.1.90 కోట్లతో వంతెనల నిర్మాణం పూర్తయ్యాయి.

శరవేగంగా పూర్తిచేశాం



నియోజకవర్గంలో రోడ్డు నిర్మాణాలు శరవేగంగా జరిగాయి. 61 పనుల్లో 50 పనులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాం. ఇందుకు రూ.40.79 కోట్లు చెల్లించాం. అలాగే 10 పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. వీటికి రూ.88.79 కోట్లు చెల్లించాల్సి ఉంది. మరో పని 1.70 కోట్ల ప్రారంభించాల్సి ఉంది. ప్రజా రవాణా అవసరాల దృష్ట్యా పనులు జరిపించాం. గ్రామీణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– రవిశంకర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ, రాయదుర్గం

జగనన్న ప్రభుత్వంలో నాణ్యమైన రోడ్లు



గుండ్లపల్లి–బొమ్మనహాళ్ రోడ్డును జగనన్న ప్రభుత్వం బాగు చేసింది. గతంలో ఈ రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉండేది. బళ్లారి పట్టణం సరిహద్దులో ఉండటంతో వాణిజ్యం, వైద్యం, ఇతర అవసరాల కోసం బళ్లారికెళ్తుంటారు. రోడ్డు బాగా లేక పోవడంతో ఇబ్బంది పడ్డాం. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో రోడ్డు చాలా బాగా అయ్యింది. రోడ్డు బాగా ఉండటంతో సమయం కూడా కలిసి వస్తోంది.

– తిమ్మప్ప, యర్రగుంట

జోడు లింగాలకు పూజలు

కూడేరు: మండల కేంద్రంలోని జోడులింగాల సంగమేశ్వరస్వామి ఆలయంలోని జోడు లింగాలకు మాఘమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. శివపార్వతులకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం పూజలు చేశారు. పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఎస్సీలకు అండగా సీఎం జగన్

విడపనకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీలకు అండగా ఉంటున్నారని ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి అన్నారు. సోమవారం వి.కొత్తకోట గ్రామానికి చెందిన భూమిలేని పేదలకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పది ఎస్సీ కుటుంబాలకు సర్వే నంబర్ 870–5లో ఎకరం చొప్పున భూమి హక్కు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామురెడ్డి, దేవరాజు, గాజుల చిన్న వెంకటేశులు, వన్నూరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బొమ్మనహాళ్: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ ఇద్దరు పట్టుబడ్డారు. వీరి నుంచి 90 ఎంఎల్ సామర్థ్యమున్న 188 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం కల్లుహోళ గ్రామానికి చెందిన బోయ కెంచన్న, గోవిందవాడ గ్రామానికి చెందిన రామాంజినేయులు సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై కర్ణాటక నుంచి మద్యం టెట్రా ప్యాకెట్లు తీసుకు వస్తుండగా కల్లుహోళ గ్రామ సమీపంలో పట్టుబడ్డారు. వాహనాన్ని సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేశారు.

జగనన్న తోనే మహిళా సాధికారత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

- ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త రంగయ్య

బ్రహ్మసముద్రం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తోనే మహిళా సాధికారత సాధ్యమైందని అనంతపురం ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయ కర్త తలారి రంగయ్య అన్నారు. సోమవారం బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు.ముందుగా సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ, ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి, అమలు చేశారన్నారు. సీఎం జగన్ మహిళా సాధికారతే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నారని అన్నారు.

టీడీపీ హయాంలో నిలువునా మోసం..

టీడీపీ హయాంలో మహిళలను నిలువునా మోసం చేశారని, ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదని ఎంపీ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందన్నారు. మహిళ సంఘాల సభ్యులు సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయం ఆవరణలో మరుగుదొడ్లు , ప్రహరీ నిర్మాణానికి రూ.6లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆసరా పథకం కింద మండల వ్యాప్తంగా 727 స్వయం సహాయక సంఘాల్లోని 7,370 మంది లబ్ధిదారులకు రూ.4,54,61,000 అందించారు. కార్యక్రమంలో ఏడీఏ రాధారాణి, జెడ్పీటీసీ ప్రభావతి , ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, మండల రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్ నాయక్, తాలూక కురుబ సంఘం అధ్యక్షుడు దొణస్వామి , జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్ రెడ్డి, గోళ్లసూరి, అంజి, మండల యూత్ కన్వీనర్ రాము, ఎస్సీ సెల్ నాయకుడు దేవపుత్ర , సర్పంచులు పూజ , ఆదినారాయణ రెడ్డి, గోవిందప్ప, ఎంపీటీసీలు నాగలక్ష్మి, వైకేపీ సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

నేడు ఎంపీ పర్యటన

శెట్టూరు: మండల కేంద్రంలో మంగళవారం ఎంపీ తలారి రంగయ్య పర్యటించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ మంజునాథ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ఉంటుందన్నారు.

రాధాస్వామి ఆలయంలో రంగయ్య పూజలు

కంబదూరు: మండలంలోని గుద్దెళ్లలో రాధాస్వామి ఆశ్రమాన్ని అనంతపురం ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య సోమవారం సందర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించేలా ఆశీర్వదించాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, రాష్ట్ర జానపద, సృజనాత్మక డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్, జిల్లా కమిటీ సభ్యుడు నీలిశంకరప్ప, వైస్ ఎంపీపీ భీమేష్, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, సీనియర్ నాయకుడు తిమ్మరాయుడు, దొణస్వామి, సర్పంచు బాపూజీ, ఆలయ ధర్మకర్త మల్లూరి వెంకటేశులు పాల్గొన్నారు.

శివాలయంలో ఎంపీ పూజలు ..: మండలంలోని జెల్లిపల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయాన్ని ఎంపీ తలారి రంగయ్య సందర్శించారు. శివుడికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు

వైఎస్సార్‌సీపీని మరోమారు గెలిపించండి

- మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి


పి.నాగిరెడ్డిపల్లిలో పథకాల బ్రోచర్ అందిస్తున్న విశ్వ, శంకర నారాయణ

కూడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పారదర్శకంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు వర్తించాయి.. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఉరవకొండ నియోజకవర్గ సమన్వయ కర్త విశ్వేశ్వరరెడ్డి , పార్లమెంట్ సమన్వయ కర్త శంకరనారా యణ ప్రజలను కోరారు. సోమవారం పి.నాగిరెడ్డిపల్లిలో వై. విశ్వేశ్వర రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. అంతకుముందు ఆయన కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. విశ్వేశ్వరరెడ్డి, శంకరనారా యణ, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధి, చేపట్టిన అభివృద్ధి పనుల కరపత్రాలను అందజేశారు.

టీడీపీ మాయ మాటలు నమ్మొద్దు..

విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికీ మేలు జరిగింది కాబట్టే.. ప్రతి ఇంటికీ వచ్చి ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకొచ్చాక ఇప్పేరు చెరువుకు నీరు విడుదల చేశామన్నారు. ఇదే పంచాయతీలో సంక్షేమ పథకాల ద్వారా రూ.49 కోట్లు ఇచ్చామన్నారు. అభివృద్ధి పనులకు రూ.4 కోట్లు ఖర్చు చేశామన్నారు. రూ.6.40 కోట్లతో ఇప్పేరు– మరుట్లకు తారు రోడ్డు నిర్మించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్, ఎంపీపీ నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అశ్విని, వైస్ ఎంపీపీలు దేవా, సుబ్బమ్మ, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నేతలు సుబ్బయ్య, పుల్లన్న, జితేంద్ర, రామ్మోహన్, మదన్‌మోహన్ రెడ్డి, సంగప్ప, గంగా .దర్, నీలకంఠారెడ్డి, భాస్కర్ రెడ్డి, శీనా, విజయ భాస్కర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, వసంత పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక భరోసా :

మండలంలోని పి.నాగిరెడ్డిపల్లికి చెందిన శ్రీనివాసులు రెడ్డికి ప్రభుత్వం నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.90 వేల చెక్కు ను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సోమవారం అందించారు. కార్యక్రమంలో సర్పంచు ఓబులేసు, ఎంపీటీసీ సభ్యు డు రమేష్, ఎంపీపీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత రహదాలకు పెద్దపీట


మరుట్ల రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి అన్నారు. కూడేరు నుంచి మరుట్ల–2 వరకు తారు రోడ్డు నిర్మాణానికి పంచాయతీ రాజ్ కింద రూ.6.40 కోట్లు నిధులు మంజూరయ్యాయి. సోమవారం మాజీ ఎమ్మెల్యే కూడేరులో మరుట్ల రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రూ. 9 కోట్లతో గొటుకూరు, కమ్మూరు, అరవకూరు, కొర్రకోడు నుంచి చోళసముద్రం మీదుగా పి.నారాయణపురానికి సిమెంట్, తారు రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. మరుట్ల రోడ్డు నిర్మాణం పూర్తయితే అంతరగంగ, ఇప్పేరు, కలగళ్ల, మరుట్ల–2 ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు అశ్విని, పార్టీ నేతలు రామచంద్రారెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, దేవేంద్ర, భాస్కర్ రెడ్డి, రాచన్న గౌడ్, సర్దార్ వలి, క్రిష్టప్ప పాల్గొన్నారు.

నేడు మాల్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కణేకల్లు: మండలంలోని మాల్యంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గరుడచేడు డాక్టర్ చంద్రమనోహర్ తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సేవలు ఉంటాయన్నారు.

17న సర్వ సభ్యసమావేశం

వజ్రకరూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈనెల 17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రమావత్‌దేవి, ఎంపీడీఓ విజయలలిత ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు,సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

నేడు వాహనాల వేలం

కళ్యాణదుర్గం రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక కారు బహిరంగ మంగళవారం వేలం వేస్తున్నట్లు రూరల్ సీఐ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ద్విచక్ర వాహనాల వేలంలో పాల్గొనే వారు రూ.1000, కారు వేలంలో పాల్గొనే వారు రూ.3వేలు చెల్లించాలన్నారు.

నేటి నుంచి కల్యాణోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 13,14 తేదీల్లో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు తెలిపారు. 13న ఆలయంలో శ్రీభూనీల లక్ష్మీసమేత నారాయణ హోమాలు, కృష్ణ పరబ్రహ్మ మూలమంత్ర హోమం జరుగుతుందన్నారు. 14న 5 గంటల నుంచి శ్రీవారి కల్యాణోత్సవం, డోలోత్సవం,. శయనోత్సవం ఉంటుందన్నారు.

రేపు అక్షరాభ్యాసం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సరస్వతీ శిశు విద్యా మందిరంలో ఈ నెల 14న అక్షరాభ్యాస కార్యక్రమం ఉంటుందని పాఠశాల అధ్యక్షుడు పొరాళ్ల ధనార్జున, హెచ్ఎం రాజేశ్వరి తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు సెల్: 7981766183లో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మృతి

వజ్రకరూరు: తట్రకల్లులో ఎంపీటీసీ రామకృష్ణ సోదరుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కె.రామప్ప (85) సోమవారం అనారోగ్యంతో మరణించాడు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, బీసీ సెల్‌కార్యదర్శి వీరభద్రగౌడ్, నాయకులు భాస్కర్, రఘు తదితరులు రామప్ప మృతదేహంపై పూల మాలలు వేసి, నివాళులర్పించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయండి


మాట్లాడుతున్న ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న

బెళుగుప్ప: అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, ప్రజాప్రతినిధులు కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బరాజు, తహసీల్దార్ హరినాథ్‌రావు ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సహకార సంఘ అధ్యక్షులు శివలింగప్ప, వైస్ ఎంపీపీ పుష్పావతి, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు సమావేశం దృష్టికి తెచ్చారు. అరటి పంటను దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి, రైతులకు నష్టాలను తెస్తున్నారని హెచ్ఓ కృష్ణతేజకు గంగవరం ఎంపీటీసీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ పృథ్వీసాగర్, ఏపీఓ అంజనేయులు, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, సెరికల్చర్ అధికారి ఫిరోజ్, వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కంది,జొన్నల కొనుగోలు

రాయదుర్గం రూరల్: గత ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన కంది, జొన్న పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేయనున్నట్లు ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు. సోమవారం మండల వ్యవసాయ కేంద్రంలో ఏఓ మహేంద్ర అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రబీలో పంటలను ఈకేవైసీ చేయించుకోని వారు ఈనెల 15లోపు చేయించుకోవాలన్నారు.

స్కేటింగ్ క్రీడాకారులకు స్వాగతం


ఉరవకొండలో స్కేటింగ్ క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణానికి చెందిన పీఈటీ మధు పర్యవేక్షణలో స్కేటింగ్‌లో శిక్షణ పొందిన ఏడుగురు క్రీడాకారులకు ఉరవకొండలో క్రీడాకారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. ఆపద్బాంధవ ట్రస్టు ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో స్వాగతం పలికారు. నాన్ స్టాప్ స్కేటింగ్‌లో అత్యున్నత శిక్షణ ఇచ్చి క్రీడాకారులు ప్రపంచ రికార్డు సాధించేలా కృషి చేస్తానని ఉరవకొండ పీఈటీ మధు తెలిపారు.